కథా నిలయం
5884
శ్రీకాకుళం

# విషవలయం

ఎదురుగా నిలబడ్డ పాపారావును చీదరగా చూశాను. "చిదంబరం! ఓ అయిదువందలు సర్దు గురూ! అర్జంట్!" దీనంగా అడిగాడు చేతులు నలుముకుంటూ.

"సారీ!" నా దగ్గర పైసా కూడా లేదు" ఖచ్చితంగా చెప్పాను.

అతని ముఖంలో నిరాశ తాండవించింది.

"నువ్వు ఇస్తావని గంపెడు ఆశతో వచ్చాను. అంతకుముందు చాలాసార్లు యిచ్చావు. అందుకే ధైర్యంగా ఎవరినీ అడగకుండా నీ దగ్గరికి వచ్చాను" అతను ఎంతో బాధపడిపోతూ చెప్పాడు.

"నిజమే! అప్పట్లో పెళ్ళి చేసుకోలేదు-కానీ ఇప్పుడు నాకు పెళ్ళయింది. నాకూ బరువు బాధ్యతలు పెరిగాయి-ఖర్చులు పెరిగాయి. అందుకే ఏమీ ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాను" చెప్పాను.

అతను మౌనంగా, దీనంగా నావంక చూస్తూ అయిదు నిమిషాలు నిల్చున్నాడు. నేనేమీ మాట్లాడకపోయేసరికి భారంగా వెళ్ళిపోయాడు.

నాకున్న బ్యాంకు బేలెన్స్‌కు అయిదు వందలు సర్దడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ, ఎందుకో ఇవ్వబుద్ధి కాలేదు. ఈ మధ్య పాపారావుమీద చాలా పుకార్లు వచ్చాయి. అందిన చోటల్లా అప్పు చేస్తున్నాడట. కానీ నాకు అతను డబ్బు ఎప్పుడూ ఎగ్గొట్టలేదు. బహుశ నేను వడ్డీ తీసుకోకపోవడం కారణం కావచ్చు.

నేనూ, పాపారావు ఒకేసారి ఉద్యోగంలో చేరాం. మనిషి చాలా అందంగా - హుందాగా ఉండేవాడు. పొదుపు ఎలా చెయ్యాలో నేను అతని దగ్గర నేర్చుకున్నాను.

కానీ, ఉద్యోగంలో చేరిన ఏడాదికే అతనికి పెళ్ళయింది. అతని భార్య కల్పన పేరుకు తగ్గట్టు భ్రమల్లో నివసించేది. కల్పన గొప్ప వాళ్ళింట్లో పుట్టలేదు. ఆమె దిగువ మధ్య తరగతి నుంచి వచ్చింది. అందునా ఆరవ సంతానం. ఒక రకంగా చెప్పాలంటే ఆమె అందం చూసి కట్నం లేకుండా కల్పనని తన వాళ్ళకి ఇష్టం లేకుండా, వారికి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకున్నాడు.

పురుషుడికి పెళ్ళి జీవితంలో ఒక భాగమే! కానీ, స్త్రీకి పెళ్ళి సర్వస్వం!

అలా కల్పన కోరికలు విజృంభించాయి. భూలోకం నుండి స్వర్గానికి - క్రింది తరగతి నుంచి కొంచెం పైతరగతికి వెళ్ళేసరికి, అసమానంగా ఆ వాతావరణంలో కొట్టుకుపోయింది. ఎన్నో సంవత్సరాలుగా ఆమెలో అణగివున్న ఆర్థిక కోరికలు రెక్కలు కట్టుకుని ఎగిరాయి.

పెళ్ళికిముందు నాకంటే ఎక్కువ బ్యాంక్ బాలెన్స్ వుంచుకునేవాడు-కానీ, ఆ మహాతల్లి ఇతన్ని పూర్తిగా మార్చేసింది. ఏట్టాగయినా పాపారావు తెలివిగలవాడు. ఆర్నెల్ల కాపురంలో ఆమెను తను ఏమాత్రం మార్చలేనన్న నిర్ణయానికి వచ్చాడు. అందుకని తానే ఆమెకు తగ్గట్టు మారడం నేర్చుకున్నాడు తప్పదు! ఏ మొగవాడైనా ఎంత టెన్షన్ని భరించగలడు?

"మనింట్లో కుట్టు మిషన్ లేదండి!" కల్పన కంప్లెయింట్ ఇచ్చింది.

"కానీ దాని అవసరం ఏముంది?" పాపారావుకు అర్థం కాలేదు.

"బావుంది-నేను కుట్టువని నేర్చుకుంటా కదా-నా జాకెట్టు నేను కుట్టుకుంటాను-తద్వారా మీకు ఆ ఛార్జీలు మిగులుతాయి." చెప్పింది.

"కానీ మనం కుట్టుమిషన్ కోసం పెట్టే డబ్బును బ్యాంకులో వేస్తే నీ జాకెట్ ఛార్జీలుపోనూ - మనకే డబ్బు మిగులుతుంది. ఇంకా, నా ఉద్దేశ్యంలో అది అనవసరం."

"మీ ఉద్దేశ్యంలో కుట్టు మిషనేం ఖర్మ - పెళ్ళాం కూడా అనవసరమే! ఆమెకు తిండి దండగ - అప్పుడప్పుడు బట్టలు కొనాలి! అదీ దండగే!" కల్పన నాలిక పదును వినే వాళ్ళకే తెలుస్తుంది.

మరుసటి రోజు కుట్టుమిషన్ వాళ్ళింటికి చేరింది.

ఓ రెండు నెలలు తర్వాత కల్పన కన్ను స్కూటర్‌మీద పడింది.

"ఏవండీ! మీరు ఇంత మంచి ఉద్యోగం చేస్తూ రోజూ ఇలా సైకిలు తొక్కుకుంటూ రావడం ఏంబాగా లేదండి - మీరు సైకిల్ తొక్కుతుంటే నా కంటికి రిక్షా తొక్కినట్టే ఉందండి."

"నీ మొహం! సైకిలుని మించిన వాహనం లేదు. ఫారిన్‌లో కార్లు అమ్మేసి సైకిళ్ళు కొంటున్నారంట!"

"సరే! మనమూ ఫారిన్‌లో ఉంటే ఆ పనే చెయ్యవచ్చు. కానీ ఇది ఇండియానేగా - నా మాట విని స్కూటర్ తీసుకోండి." బతిమాలింది.

"నో! నాకు సైకిలే బాగుంది."

"ఛీ! అడుక్కునేవాడు కూడా సైకిల్‌మీద తిరుగుతున్నాడు ఈ కాలంలో! మీరెలాగైనా స్కూటర్ తియ్యాల్సిందే - అప్పుడు మనం ఎంచక్కా స్కూటర్‌మీద కూర్చొని చిలకా గోరింకల్లాగా వెళ్ళచ్చు."

"సారీ! నా దగ్గర డబ్బుల్లే వు - ఏ నెల కానెల ఈ ఇల్లు గడవడమే కష్టంగా వుంది!"ఖచ్చితంగా చెప్పేశాడు.

"ఆ దిగులు మీకేం అక్కరలేదు - ఇన్‌స్టాల్‌మెంట్‌లో పక్కింటి అన్నయ్యగారిప్పిస్తానన్నారు. బోల్డు కంపెనీలు ఋణం ఇస్తాయిట" అంటూ అన్నీ ఏకరువు పెట్టింది.

ఆపైన రెండు రోజులు వాళ్ళింట్లో యుద్ధం జరిగింది. చివరికి సంధి కుదిరింది. సంధి షరతుల ప్రకారం ఇంటికి స్కూటర్ వచ్చింది. ఎలాగూ రిక్షా ఖర్చు తగ్గింది కదాని స్కూటర్‌లో ఎక్కి ఎడాపెడా పిక్నిక్‌లు - సిన్మాలూ చెడతిరిగారు.

అదేం దురదృష్టమోగానీ.... కల్పన ఇంటి పక్కవాళ్ళు బ్లాక్ అండ్ వైట్ టీవీ కొన్నారు. ఓసారి ఈమె సిన్మా చూడ్డానికి వెళితే వాళ్ళు కుర్చీవేసి మర్యాద చేయలేదట. అంతే!

"ఏమండీ మీకు నామీద ప్రేమ వుందా లేదా?"

"ఎందుకొచ్చిందా అనుమానం?"

"కట్టుకున్న పెళ్ళాం నలుగురిలో నవ్వులపాలయితే...."

"ఛ! ఛ! నేనేం చేశాను"

"ఇంకేం కావాలి? టీ.వీ.లో సినిమా వస్తే నేను చూడ్డానికి పక్కింటికెళ్ళాలా?...ఛీ! ఛీ! ఇంత బ్రతుకూ బ్రతికి.... వాళ్ళముందు అవమానాల పాలుకావాలా?"

"పోనీ పోమాకు..... చూడ్డంమానెయ్యి."

"నలుగురూ నవ్వరుటండీ!"

"అయితే ఏం చెయ్యమంటావు."

"వెంటనే టీ.వీ. కొనండి"

"అమ్మో! అయిదువేలు!"

"అయిదు కాదు... పదివేలు..."

"పదివేలా?"

"ఎస్! కలర్ టీ.వీ. అంతకంటే తక్కువకిరాదు."

"ఇప్పుడు కలర్ టీ.వీ. ఎందుకు?"

"ఎందుకా? పక్కింటి కామాక్షమ్మ కంటే మనం గొప్పవాళ్ళమని తెలియజెప్పడానికి?"

"డబ్బులూ!"

"ఎప్పుడూ వుండే పాటేగా... మీకు చాతకాకపోతే చెప్పండి... నేనిప్పిస్తాను... కంపెనీవాడే అరేంజ్ చేస్తాడట."

కలర్ టీ.వీ.కి రెక్కలొచ్చి కల్పన ఇంట్లో వాలింది.

ఇవన్నీ కల్పన మనస్తత్వానికి మచ్చు తునకలు మాత్రమే! చాలా నగలు చేయించుకుంటుంది. ఎప్పుడన్నా అవసరంపడి పాపారావు తండ్రి డబ్బు పంపమని రాసినా పడనిచ్చేది కాదు.

ఎదురింటి వాళ్ళు సోఫాలు కొన్నారని తనూ కొనింది. పండగలు వస్తే బట్టలు

కొనాల్సిందే. పెట్టె పట్టకపోతే బీరువా కొంటుంది-వాటికోసం!

క్రమంగా సంసారం విస్తరించింది. ఇప్పుడతనికి ముగ్గురు ఆడపిల్లలు. ఒక మొగపిల్లవాడు... ఆఖరివాడు.

అతను అప్పు చేయనివాడు పాపాత్ముడు.

అరవైనాలుగు కళల్లో అప్పుకూడా ఒక కళే!

అవసరం కొద్దీ ఆ కళలో పాపారావు మాస్టరు అయిపోయాడు. మామూలుగా అడిగితే ఎవరూ అప్పివ్వరని తెలుసుకున్నాడు. అందుకే కొంచం నటన నేర్చుకున్నాడు. ఓ రోజు తల్లికి సీరియస్ అయిందంటాడు.... ఇంకోరోజు భార్య ఆస్పత్రిలో చేరిందంటాడు... ఇంకోమారు పిల్లల స్కూలు ఫీజు కట్టాలంటాడు.

అతను చెపుతున్నప్పుడు అతని మొహం చూస్తే అతను నిజంగా ఎంత బాధల్లో ఉన్నాడోనని జాలిపడతాం.

ఎందుకో పాపారావు నా దగ్గర తీసుకున్న బాకీలన్నీ వెంటనే చెల్లించేవాడు. మిగతా వాళ్ళకు బాకీ పెట్టినా నా దగ్గర కొచ్చేసరికి ప్రాంప్ట్‌గా వుండేవాడు.

మొదటిసారి అతను అప్పు అడిగితే కాదన్నాను.

గుండె బరువుగా ఉంది.

అతని కోసం కబురు చేశాగానీ అతను సీట్లో లేడు.

సాయంత్రం కాళ్ళీడ్చుకుంటూ పాపారావు ఇంటికి బయలుదేరాను. అల్లంత దూరంలో అతని ఇల్లు కన్పిస్తుండగానే గలభా వినిపిస్తోంది. ఇంటి ముందు పొట్లాట! గుంపుచేరి ఉన్నారు. నేను గబగబా అక్కడికి వెళ్ళాను.

"అంత పౌరుషం ఉన్నదానివి మా అద్దె చెల్లించవచ్చుగా!"

"బోడి అద్దె! ఇస్తాం లేవయ్యా!"

"ఏదీ, ఆ బోడి అద్దె మూడు నెలలది ఇవ్వాలి... ఏదీ ఒక్క నెలది ఇవ్వు చూద్దాం ...." ఇంటి వోనర్ ఎగతాళిగా అన్నాడు.

"ఏం పెద్ద మనిషివయ్యా... ఇంట్లో మొగవాళ్ళు లేనప్పుడు వచ్చి ఆగం చేస్తున్నావు.... ఆయనున్నప్పుడు రా" కల్పన అరిచింది.

"ఏం నాకు భయమా? ఏం చేస్తాడేంటి?"

"ఇలా గొడవ చేసినట్లు తెలిస్తే ఏ కీలు కాకీలు విరిచేస్తాడు."

"అబ్బో! ఇప్పుడే హాస్పిటల్‌కి వెళ్ళి వస్తున్నా.... అతగాడు విరిచేసిన కీళ్ళను చూసి ముందు డబ్బులిస్తావా.... సామాన్లు బయట పారేయమంటావా?"

"ఏదీ పారేయ్ చూద్దాం..... రేపీపాటికి కటకటాల వెనకాల వుంటావు... నా సంగతి నీకు తెలీదు" కల్పన అంది. ఈలోగా ఆమె నన్ను చూసింది. "చూడండి అన్నయ్యగారూ... ముష్టి పదిహేను వందలకి ఎన్నేసి మాటలంటున్నాడో!"

నాకు జాలి కలిగింది. ఎంతైనా ఆడకూతురు.... రోడ్డు మీద గొడవ.... అందరూ చూస్తున్నారు. నా మొగతనం ప్రదర్శించాలి కదా! "చూడండి... పదిహేను వందలకి ఇలా అల్లరి పెట్టడం ఏం బాగోలేదు.... ఇంకోరోజున రండి..... మావాడు యిచ్చేస్తాడు" చెప్పాను.

"బాబూ! తమరు అతగాడి స్నేహితునిలా ఉన్నారు... ఈరోజురా, రేపురా అని ఇప్పటికి కనీసం పాతికసార్లు పైన తిప్పి వుంటారు... మనిషన్న వాడికి చీము, నెత్తురు ఉండాలిగా!" అన్నాడు.

"సరే! ఓ నెల అద్దెయిస్తా... తీసుకుని వెళ్ళండి... మళ్ళీ నెలదాకా కనబడమాకు" దర్పంగా అయిదు పచ్చనోట్లు అతనికిచ్చాను.

సలాం కొట్టి పోతూ ఆమెవంక కొరకొర చూశాడు. ఇవ్వాల్టికి తప్పించుకున్నావన్న హెచ్చరిక ఉంది.

కల్పనతో పాటు నేనూ లోపలికి నడిచాను.

"థ్యాంక్స్ అన్నయ్యగారూ! సమయానికొచ్చి ఆ గాడిదకు బాగా బుద్ధి చెప్పారు..." కల్పన చెప్పింది.

"ఏ నెల అద్దె ఆ నెల అతని మొహాన కొట్టచ్చుగా!"

"నిజమే! ఆయన ఎందుకో బద్ధకిస్తున్నారు" కల్పన చెప్పింది.

"బద్ధకమా! నాబొంందా! డబ్బులుంటేగా, యివ్వడానికి" దొడ్డి తలుపుగుండా లోపలికొస్తూ అన్నాడు పాపారావు.

"పాపారావు! నువ్వెక్కడున్నావ్!"

"మరీ గొర్రెతోక బెత్తెడు లాగా జీతాలు తగ్గిపోతున్నాయి అన్నయ్యగారూ!" – కల్పన అంది.

"పాపారావు! దుఃఖాలకు మూలకారణం కోరికలే అని బుద్ధుడు చెప్పాడు గుర్తుందా? కాబట్టి ముందు కోర్కెలని అదుపు చేసుకో – వచ్చే ఆదాయాన్ని మదుపు చేసుకో." చెప్పాను అతనికి.

"నా బొంద! ఇంక బ్రతకడమెందుకు? జీవితం అనుభవించడానికి కాకపోతే యింకబ్రతికి ప్రయోజనమేమిటి?" కల్పన అంటూ ఉంటే నాకు భలే కోపం వచ్చింది.

"చూడమ్మా! మనకు వెయ్యి రూపాయలొస్తే మనం తొమ్మిది వందలే ఖర్చు పెట్టుకొని

వంద బ్యాంక్‌లో వేసుకోవాలి భవిష్యత్ కోసం.... అంతేగాని... వెయ్యివస్తే... పన్నెండు వందలు ఖర్చు పెడితే దేవుడు కూడా మన్ని క్షమించడు....." చెప్పాను.

కల్పన కింద పెదవి నొక్కింది.

"థ్యాంక్స్ చిదంబరం! సమయానికి వచ్చి ఆదుకున్నావ్! ఓసే! కాఫీ ఉందా?" పాపారావు అడిగాడు.

"ఇప్పుడేగా అన్నయ్యగారు చెప్పారు.... కోరికలు చంపుకోమని" నిష్ఠూరంగా అంది.

"తప్పదమ్మా! మన అవసరాలకు తగ్గట్టు మనం సంపాదించుకోవడమన్నా నేర్చుకోవాలి. లేదా మన సంపాదనకు తగ్గట్టు మన అవసరాల్ని కుదించుకోవడమన్నా నేర్చుకోవాలి. లేకపోతే విషపరిణామాలు సంభవిస్తాయి." చెప్పాను.

"ఇవన్నీ చేతకాని వాళ్ళు చెప్పేమాటలు! మొగుడు సంపాదించాలి - ఖర్చు పెట్టాలి" పాపారావు అన్నాడు.

"నేను కాబట్టి ఈ సంసారం ఈదుకొస్తున్నాను. ఇంకొకతె అయితే ఎప్పుడో పారిపోయేది!" కల్పన విసురుగా అని వెళ్ళిపోయింది.

నెల గడిచింది - రెండు నెలలు గడిచాయి - నా అయిదు వందలు మటుకు నాకు వాపసు రాలేదు - చూచాయగా అడిగాను.

పాపారావు వి.సి.ఆర్.కొన్నాడన్న వార్త మా ఆఫీసులో బాంబులా పేలింది.

మా ఆఫీసులో అతను ముప్పాతిక మందికి బాకీ ఉన్నాడు. అటువంటిది మళ్ళీ కొత్త అప్పు చేసి అతను వి.సి.ఆర్. కొనడం సాహసం! ఏం తొందరొచ్చిందని?

"పాపారావు! వి.సి.ఆర్.కొనడానికి నీకు బుద్ధి ఎలా వచ్చింది? పీకలోతు అప్పుల్లో ఉండి... ఎలా కొన్నావు! మేమెవరం ధైర్యం చేయలేదే!"... అడిగేశాను.

"చిదంబరం! అదొక చిదంబర రహస్యం!" నవ్వుతూ అన్నాడు.

"నీమొహం! అదేమిటో చెప్పు"

"చన్నీళ్ళకు వేణ్ణీళ్ళుగా వి.సి.ఆర్. అద్దెకు తిప్పితే రోజూ నలభై, యాభై అద్దె వసూలవుంది. దానితో మీ అందరి అప్పు తీర్చివేయొచ్చు..... సో.... నేను అది కొన్నది మీ కోసమే.... నాకోసం కాదు" తేలిగ్గా చెప్పేశాడు.

అతని వంచనా చాతుర్యానికి మేం ఆశ్చర్యపోయాం! "భూ ప్రపంచంలో అతనికింకా అప్పులిచ్చేవాళ్ళున్నారా' అని ఆశ్చర్యపోయాం! ఏమాటకామాటే చెప్పకోవాలి! నాకు ఓ వంద అప్పు చేయడం కూడా రాదు..... అటువంటిది చిదంబరం-వెధవది వేలకి వేలు అప్పు చేసేస్తున్నాడు!

దేనికైనా గుండె ధైర్యం కావాలి!

ఆరోజు దీనంగా వచ్చి ఓ వెయ్యి అప్పు అడిగాడు నన్ను!

"నువ్వు నాకు అయిదొందలు యివ్వాలి గుర్తుందా?"

"ఆ మొత్తం పదిహేను వందలు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తా!"

"ఎలా ఇస్తావు?"

"అది నాకొదిలెయ్యి! నీ డబ్బు నీకిస్తాను."

"పాపారావు! నీ పరిస్థితి చూస్తుంటే నువ్వు తీర్చలేవని నా కనిపిస్తుంది! అందుకే అడిగా - ఎలా తీరుస్తావ్!"

"టైం వేస్టు చెయ్యొద్దు - తొందరగా వెయ్యి ఇచ్చెయ్యి."

"ఇవ్వకపోతే....!"

"ఇంకెప్పుడు జీవితంలో నిన్ను అడగను" కోపంగా వెళ్ళిపోయాడు. మరునాడు నా ఫ్యాన్ సత్తిగాడు పిడుగులాంటి వార్త మోసుకొచ్చాడు.

పాపారావు చనిపోయాడని!

గుండె ఆగి చనిపోయాడని!!

పిడుగులా ఉండే పాపారావు -ఇంత చిన్న వయసులో గుండె ఆగి మరణించడం నమ్మబుద్ధి కాలేదు నాకు. కానీ వాస్తవాలు కథలకంటే విడ్డూరంగా వుంటాయి మరి!

"పాపం! అప్పుల బరువు మోసి, మోసి పాపారావ గుండె ఆగిపోయి వుంటుంది. పాపం! పై లోకంలో ఎవరిస్తారు-అప్పు-పాపారావుకు!"

"నీకు దిగులేం అక్కరలేదు... ఈపాటికి యముడ్ని అడిగేసి వుంటాడు."

"పాపం! అర్ధాయుష్షు వెధవ! రోజూ ఒకసారన్నా వచ్చి కాస్తో కూస్తో అప్పు అడిగి వెళ్తూండేవాడు."

"కానీ... నాకు చాలా బాకీపడ్డాడు.... ఇప్పుడెవరు తీరుస్తారు ఆ బాకీలన్నీ?"

"దేవుడి అకౌంట్‌లో రాసుకో!"

ఇలా రకరకాలుగా వ్యాఖ్యానించడం మొదలెట్టారు.

బరువెక్కిన హృదయంతో అతని దహన సంస్కారాలకు హాజరయ్యాను.

చిన్న పిల్లల్ని .... కల్పనని చూడలేపోయాను. పదవ రోజు కల్పన నన్ను పక్కకి పిలిచింది.

"అన్నయ్యగారూ... చిన్న సాయం చేసి పెట్టాలి."

నా గుండె కొట్టుకుంది... సాయం అంటే మళ్ళీ అప్పు అడుగుతుందేమోనని.

"చెప్పు చెల్లెమ్మా?"

"ఆయన ఓ లక్షకు ఇన్సూర్ చేశారట, రెండేళ్ళకిందట! ఆ డబ్బులు వచ్చే ఏర్పాటు చూడండి." దీనంగా అంది.

నా చెవులు నేను నమ్మలేకపోయాను. వాడు ఆ మాత్రం జాగ్రత్తపడ్డందుకు సంతోషించాను.

"ఆ లక్ష వస్తే చేతనైనన్ని అప్పులు తీర్చేస్తాను... వెధవ అప్పులు ఆయన ప్రాణం బలిగొన్నాయ్!" కల్పన అంది.

"ఆ దిగులు పడకమ్మా! నీకు ఉద్యోగం కూడా వస్తుంది. అప్పులు నిదానంగా తీరుద్దువుగాని.... అయినా వాడితోనే అవి పోయాయి."

"అన్నయ్యగారూ! మీకో రహస్యం చెప్పనా.... ఆయన గుండెపోటుతో మరణించలేదు. అప్పుల బాధ పడలేక ఆత్మహత్య చేసుకున్నారు...." ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ చెప్పింది.

నివ్వెరపోవడం నావంతయింది.

అప్పు చేసే అలవాటు ఒక మత్తు మందులాంటిది. చేస్తూ ఉంటే ఇంకా ఇంకా చెయ్యాలనిపిస్తుంది, చివరికి మోయలేని భారం తలకు ఎత్తుతుంది. దాని పరిణామం మటుకు విషాదాంతమే!

"అప్పుల ఊబి నుంచి బయట పడ్డవాడు ధన్యుడు సుమతీ!" కళ్ళు తుడుచుకుంటూ గుర్తు చేసుకున్నాను మా గురువు చెప్పిన మాటలు! కానీ ఆ విషవలయంలో విషయవలయంలో ఒకసారి ఇరుక్కొని బయటపడిన వారు కానీ పడగలవారు కానీ ఎవరైనా బయటపడి బ్రతికినవారు కానీ ఈ ప్రపంచంలో లేరనిపించింది నాకు.

( ఆంధ్రప్రభ సచిత్ర వార్త పత్రిక )

3-7-1991)